


# స్నేహం - ప్రేమ

పి.వి.భగవతి, Lawrenceville,NJ

*వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన 16వ ఉగాది ఉత్తమ రచనల పోటీలో*

*- ఉత్తమ కథానిక విభాగంలో - బహుమతి పొందిన కథ*

**వరంగల్ ఇంజనీరింగ్ కాలేజ్.** దేశం నలుమూలల నుంచీ ఎంతో మంది విద్యార్థులు అక్కడికి వచ్చి చదువుకుంటుంటారు. కాలేజీ క్యాంపస్ అంతా చాలాకోలాహలంగా ఉంది. అక్కడక్కడా "వెల్కం టు ఫ్రెషర్స్" అని బ్యానర్లు కట్టి ఉన్నాయి. అంతవరకూ బి.టెక్. మొదటి సంవత్సరంలో ఉన్న స్టూడెంట్స్ కొత్తగా సీనియర్సు అయిన ఉత్సాహంలో ఉన్నారు. మొదటి 1, 2 యేళ్ళు జూనియర్, సీనియర్ల మధ్య ర్యాగింగ్‌ల సరదా ఉంటుంది. ఆ పైన చదువుల మీద దృష్టి పడుతుంది. కొంత మంది పై చదువులకు విదేశాలకు వెళ్ళే ప్రయత్నాలు చేసుకుంటే మరికొంత మంది అక్కడే పి. జి చేయడానికి సన్నాహాలు చేసుకుంటారు. ఇంకొంత మంది బి.టెక్. తోనే చదువు ఆపేసి ఉద్యోగప్రయత్నాలు చేసుకుంటారు. మరో పక్క కంప్యూటర్ కోర్సుల ట్రైనింగ్‌లు నడుస్తుంటాయి. ప్రస్తుతం మాత్రం కాలేజీలో పండగ వాతావరణం కనబడుతోంది.

గంట ఉదయం పది అవుతుండగా ఫ్రెషర్స్ ఒక్కొక్కరు రావడం మొదలయింది. ఒక్కసారిగా జీన్స్ ప్యాంట్స్, చుడీదార్లు, స్కర్ట్‌లు..ఇలా రకరకాలల వస్త్రధారణలతో అమ్మాయిలు...వాళ్ళకు యేమాత్రం తీసిపోకుండా అబ్బాయిలతో క్యాంపస్ నిండిపోయింది.

కాలేజీకి ఆనుకునే హాస్టల్ బిల్డింగ్స్ ఉన్నాయి. బ్యాచ్‌కి పాతిక మంది ఉంటే అందులో సగం పైగా హాస్టల్‌లోనే ఉంటారు.

అంత కోలాహలం లోనూ ఆ అమ్మాయి ప్రత్యేకంగా గమనించ తగ్గట్టు ఉంది. దాదాపు పాదాలవరకూ ఉన్న చాక్లెట్ కలర్ లాంగ్ స్కర్ట్ మీద లేత గోధుమ రంగు టాప్ వేసుకుని ఉంది. ఎత్తు తను వేసుకున్న హీల్స్‌తో కలిపి 5' 5" ఉండచ్చు. ఛామన ఛాయ కన్నా కాస్త ఎక్కువ రంగుతో ఎంతో కళగా ఉన్న మొహం, భుజాలు దాటి వదులుగా ఉన్న హెయిర్ స్టయిల్‌తో బాక్ పాక్ సర్దుకుంటూ వస్తున్న ఆ అమ్మాయిని చూడని కళ్ళు లేవంటే అతిశయోక్తి కాదు. జూనియర్ అబ్బాయిలంతా ఈ అమ్మయి వాళ్ళ బ్రాంచ్ అయితే బావుండు అనుకోసాగారు. తోటి అమ్మాయిలు కూడా మనస్ఫూర్తిగా ఒప్పుకునేంత అందంగా ఉంది తను. అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఆ అమ్మాయి తన క్లాసు రూము ఎక్కడో బోర్డ్ మీదచూసుకుని అటువైపు వెళ్ళింది. అప్పటికే దాదాపు క్లాసు నిండి ఉంది. నేరుగా వెళ్ళి తన కంటే

కాస్త పొట్టిగా ఉన్నా, తెల్లగా, ఎంతో కళగా, కళ్ళజోడు పెట్టుకుని, పొడవు జడతో, లంగా ఓణీలో చూడగానే మంచి ఇంప్రెషన్ వచ్చేట్టు ఉన్న ఓ అమ్మాయి పక్కకి వెళ్ళి కూర్చుంది.

క్లాసులో అంత మంది ఉన్నా మొదటిగా ఆ కళ్ళజోడు అమ్మాయినే పరిచయం చేసుకోవాలని అనిపించింది....వీళ్ళ ఈ పరిచయం మునుముందు ఓ అపురూపమైన అనుబంధంగా మారబోతోందని ఆ క్షణం ఆ ఇద్దరికీ తెలియదు.

"హలో..నా పేరు కీర్తి", అంది లంగా ఓణీ అమ్మాయి. "మధు...మధుమతి" అని తనని పరిచయం చేసుకుంది. మరో పది నిమిషాల్లోనే ఇద్దరూ వాళ్ళ పుట్టు పూర్వోత్తరాలు మాట్లాడేసుకున్నారు. ఇద్దరూ హైదరాబాదు నుంచీ వచ్చినందువల్ల మరికాస్త చనువు కుదిరింది. కీర్తి హాస్టల్‌లో ఉండి చదవబోతుండటం వల్ల అప్పటికి రెండు రోజుల ముందే వచ్చి చేరింది. మధు మాత్రం అదే ఊర్లో ఉన్న తన అక్క, బావ దగ్గర ఉండబోతోంది.

ఇంతలో కాలేజీ డీన్ రావడం, 'ఓరియంటేషన్ సెషన్' జరిగి కాలేజీ అంతా చుట్టి చూడటం జరిగింది. ఆ రోజు క్లాసులేమీ జరగకపోవడం వల్ల కీర్తి మధుని తనతో హాస్టల్‌కి తీసుకెళ్ళి అక్కడ కొంతమంది అమ్మాయిలను పరిచయం చేసింది. హుషారుగా మొదటి రోజు ముగించి ఇంటికి చేరింది మధు.

మధు వాళ్ళు ఇద్దరు ఆడపిల్లలు. తను, అక్క స్వప్న. స్వప్న భర్త రాజేష్ వరంగల్ లోనే ఓ ప్రైవేటు కంపెనీలో మంచి ఉద్యోగం లో ఉన్నాడు. వాళ్ళకు మూడేళ్ళ పాప.

ఇంటికి వచ్చిన కాసేపటికి కాలేజీ కబుర్లు చెల్లెల్ని అడుగుతూ

"వంశీ కలిసాడా మధు?" అంది స్వప్న.

"లేదక్కా క్లాసులేమీ జరగలేదు...ఎక్కువ సేపు లేము కాలేజీలో" సమాధానం ఇచ్చింది మధు.

ఇంతలో ఇంటి బయట బైక్ ఆగిన చప్పుడుకి స్వప్న వెళ్ళేలోపే వంశీ లోపలికి వచ్చాడు.

వంశీ హైదరాబాదులో మధు వాళ్ళ ఇంటి దగ్గరే ఉంటాడు. ఇప్పుడు ఇదే కాలేజీలో బి.టెక్. మూడో సంవత్సరంలో ఉన్నాడు. మధు, వంశీ మంచి స్నేహితులు. స్వప్నకు కూడా అతనితో మంచి పరిచయం ఉంది. వంశీ కూడా కాలేజీ హాస్టల్‌లోనే ఉంటాడు. ఇదే ఊరు కావడంతో స్వప్న వాళ్ళ ఇంటికి వస్తూ, పోతూ ఉంటాడు కూడా. అందరితో కలిసి భోజనం చేసి వెళ్ళిపోయాడు వంశీ.

కొత్త పరిచయాలతో, సరదా రాగింగ్‌లతో, అప్పుడప్పుడు చదువులతో రెండు నెలలు గడిచాయి. ఈ రెండు నెలలలో మధు, కీర్తి చాలా మంచి స్నేహితులయ్యారు. క్లాసు మొత్తానికి మధు చురుకైతే, కీర్తి చదువులో అందరి కంటె ముందు ఉండేది.

వంశీ రోజూ మధుని కాలేజీలో కలుస్తుండే వాడు. అతని స్నేహితురాలవ్వడం వల్ల మధుని, మధుతో ఉన్నందుకు కీర్తిని యెవ్వరూ రాగింగ్ చేసేవాళ్ళు కాదు. చాలా ఆకర్షణీయంగా ఉన్న మధు అన్నా, అందంగా, పొందిగ్గా ఉన్న కీర్తి అన్నా మొగపిల్లలందరికీ ఇంట్రెస్టే. కానీ వంశీ మూలాన ఈ ఇద్దరు ఆడపిల్లల జోలికి యెవ్వరూ వెళ్ళేవాళ్ళు కాదు.

ఓసారి యేదో పరీక్ష పని మీద వంశీ హైదరాబాదు వెళ్ళాడు. ఇదే అదను అనుకుని వంశీ వచ్చేలోపు మధు, కీర్తిలను బాగా రాగ్ చేయాలని నిశ్చయించుకుంది ఓ గ్యాంగ్. మర్నాడు ఈ ఇద్దరు క్యాంపస్‌లో అడుగు పెట్టిందే తడవుగా రాగింగ్ మొదలు పెట్టారు. సరదగానే మొదలయిన ప్రక్రియ ఓ కుర్రాడు కాస్త శ్రుతి మించడంతో కీర్తి వేసుకున్న ఓణీ కాస్తా వాడి చేతిలోకి వచ్చేసింది. ఉన్నట్టుండి జరిగిన ఈ పని వల్ల చాలా అవమానంతో కీర్తి మధుని హత్తుకు నిలబడి యేడవ సాగింది. కోపంతో మధు వాడి మీద చేయి ఎత్తగా ఆ కుర్రాడు తోయడంతో బాలన్స్ తప్పి పక్కకు పడబోయింది. అదే సమయానికి వంశీ స్నేహితుడయిన విజయ్ రావడంతో మధుని కింద పడకుండా పట్టుకున్నాడు. అక్కడ జరుగుతున్న తతంగం చూడగానే విజయ్‌కు చాలా ఆవేశం వచ్చేసింది. వెంటనే ఆ బ్యాచ్ మీదకు

గొడవకు వెళ్ళాడు. చుట్టు ఉన్న స్టూడెంట్స్ వచ్చి ఆపకపోతే పెద్ద గొడవే జరిగుండేది. వాళ్ళ దగ్గరుండిపోయిన కీర్తి ఓణీ తీసుకుని కీర్తికి ఇచ్చాడు. మధు, మరికొంతమంది అమ్మాయిలు వెంటరాగా కీర్తి వెయిటింగ్ రూంకి వెళ్ళి, నలుగురూ సముదాయించాక కాస్త తేరుకుంది. అందరూ క్లాసులకి బయలుదేరారు.

వంశీ ఊరునుంచీ వచ్చాక ఆ రాగింగ్ చేసిన బ్యాచ్‌తో బాగా ఘర్షణ పడ్డాడు. వాళ్ళు వచ్చి మధు, కీర్తిలకు క్షమార్పణ చెప్పే వరకూ ఊరుకోలేదు. ఈ సంఘటణ జరిగిన తరువాత మధు, కీర్తి విజయ్‌తో బాగా స్నేహం చేయసాగారు.

ఇలాంటి ఎన్నో చిన్న, పెద్ద సంఘటణల మధ్య మొదటి సంవత్సరం వచ్చింది. మధు, కీర్తి రెండో యేడుకి వచ్చేసరికి విజయ్, వంశీ ఫైనల్ ఇయర్‌లోకి అడుగు పెట్టారు.

మధు తన అక్క, బావలతో ఉండటంతో కీర్తి తరచుగా వచ్చి మధుతో ఉండేది. బి.టెక్. రెండో యేడులో అడుగు పెట్టిన కొత్తలో మధు వాళ్ళ అక్క కూతురిది పుట్టిన రోజు ఫంక్షన్ వచ్చింది. రెండు రోజుల ముందే కీర్తి వచ్చి మధు ఇంట్లో ఉంది. ఫంక్షన్‌కి డెకరేషన్‌లకి సహాయ పడటానికి వంశీ...అతనితో పాటు విజయ్ కూడా వచ్చారు. ఈ సందర్భంగా అందరి మధ్య చనువు బాగా యేర్పడింది. మధుకి విజయ్ నడవడిక ఎంతో నచ్చేది. తనని అన్నాళ్ళ పరిచయం ఉన్నా "మధుమతి..మీరు" అనేవాడు. అలా పూర్తి పేరు పెట్టి తనని పిలిచేది ఒక్క విజయ్ మాత్రమే.

గడచిన సంవత్సర కాలంలో కనీసం సల్వార్ కమీజ్ కూడా ఏనాడూ వేసుకోలేదు మధు. అత్యాధునికంగా ఉన్న వస్త్రధారణతో, వాటికి తగ్గ హెయిర్ స్టయిల్స్‌తో, సినిమా హీరోయిన్లకి యేమాత్రం తీసిపోకుండా ఉండే మధుని చూసి అందరితో పాటు విజయ్ కూడా అమెను చాలా ఫాస్ట్ అని తీర్మానించాడు. కానీ అంత అల్ట్రామాడ్రన్‌గా ఉన్న మధుమతి లో సంప్రదాయానికి విలువ ఇచ్చే ఓ తెలుగింటి అమ్మాయి దాగుందని చాలా సన్నిహితులకి తప్ప తెలియదు.

మధుతో స్నేహం విజయ్‌కి యెంతో నచ్చేది. విజయ్ వాళ్ళది వరంగల్‌కి దగ్గర ఓ చిన్న ఊరు. బాగా కలిగిన కుటుంబం. రోజూ కాలేజీకి వెళ్ళి రావడం కష్టంగా ఉందని ఇక్కడే ఓ చిన్న అపార్ట్ మెంటు అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. కాలేజీ నుంచీ మధుని బైక్ మీద ఇంటికి దించడం...దారిలో ఐస్క్రీం కని, కాఫీకని ఆగడం లాంటివి తరచుగా జరిగేవి.

ఓపక్క ఈ ఇద్దరి స్నేహం మరో రూపు దాల్చుచుండగా, మరో వైపు కీర్తి సింప్లిసిటీ వంశీని బాగా ఆకర్షించ సాగింది. కాలేజీ అవగానే హాస్టల్‌కి వెళ్ళిపోవడం...కాసేపటికే లైబ్రరీ లో చదువుకోవడానికి వచ్చేయడం...ప్రతి శుక్రవారం గుడికి వెళ్ళడం...ఈ కాలంలో కూడా యెప్పుడూ లంగా ఓణీలే వేసుకోవడం...ఇవన్నీ వంశీకి యెంతగానో నచ్చడమే కాక ఆమె మీద ప్రత్యేకమైన శ్రద్ధ కలిగించాయి.

వంశీ, విజయ్‌లకు ఫైనల్ ఇయర్ పరీక్షలు దగ్గర పడ్డాయి. పరీక్షలయ్యాక వంశీ ఇక్కడే మంచి ఉద్యోగం సంపాదించే ప్రయత్నాల్లో ఉండగా, విజయ్ మాత్రం విదేశాలకి పై చదువులకి వెళ్ళే సన్నాహాల్లో ఉన్నాడు. వంశీ, విజయ్ వాళ్ళకి పరీక్షలు జరుగుతుండగా మిగతా అందరికీ రెండు వారాలపాటు సెలవులు ఇచ్చేసారు. మధు, కీర్తి హైదరాబాదు వెళ్ళిపోయారు. పరీక్షలయ్యాక వంశీ కూడా హైదరాబాదుకి బయలుదేరాడు. అదే సమయానికి విజయ్‌కి కూడా హైదరాబాదులో ఎంట్రన్స్ పరీక్ష ఉండటంతో వంశీతో కూడా వెళ్ళాడు. అక్కడ తన పని అయ్యాక మధు, కీర్తిలని కలిసి నలుగురూ ఊరంతా బాగా తిరిగారు. మరో నాలుగు రోజుల్లో కాలేజీ తెరుస్తారనగా వరంగల్‌లో మధు వాళ్ళ బావ క్యాంప్‌కి వెళ్ళాల్సి వచ్చి వెంటనే వాళ్ళ అక్కకి తోడు ఉండటం కోసం బయలుదేరుతోంది. విజయ్ కూడా పరీక్ష అయిపోవడంతో తనూ అదేరోజు వెళుతున్నాడు. ఇద్దరు ఆ సాయంత్రం కలిసి కారులో బయలుదేరారు.

విజయ్ డ్రైవ్ చేస్తున్నాడు. కారు సిటీ దాటగానే మధు చనువుగా కారులో సి.డి. లు మార్చసాగింది. అన్నీ చూసి ఓ లేటెస్ట్ పాప్ ఆల్బం పెట్టింది. ఈ అమ్మాయి చాలా ఫాస్ట్ సుమా అని మరోసారి అనుకున్నాడు విజయ్.

ఓ గంట ప్రయాణం గడిచిందో లేదో ఉన్నట్టుండి మబ్బులు మూసుకుని వర్షం మొదలయ్యింది. కాసేపట్లోనే ఉరుములు, మెరుపులతో వాతావరణం ఉధృతం అయింది. గంట అప్పటికే సాయంత్రం ఏడు దాటుతోంది. చీకట్లో, వర్షంలో విజయ్‌కు డ్రైవింగ్ చాలా కష్టంగా ఉంది. అందులోనూ ఆకాశం ఉరిమిన ప్రతిసారి భయానికి మధు ఉలికిపాటుతో విజయ్ చేయి పట్టుకోసాగింది. కాసేపటికి విజయ్ ఇక లాభం లేదని ఓ చేత్తో మధు చేయిని పట్టుకుని ఒక చేత్తోనే డ్రైవ్ చేయసాగాడు.

మరో అరగంటకు దారిలో డాబా ఒకటి కనబడటంతో ఇద్దరూ కాసేపు ప్రయాణం ఆపడానికి నిశ్చయించుకున్నారు. కారు పార్కు చేసి డాబా లోపలికి వేళ్ళేసరికే పూర్తిగా తడిసి పోయారు. వర్షం కాస్త తెరిపి ఇచ్చే వరకూ అక్కడే ఉండి మళ్ళీ బయలుదేరారు. అక్కకి ఫోను చేసి ఇలా దారిలో చిక్కుకున్నామని, విజయ్ తోడు ఉన్నాడని, యెప్పటికి చేరతామో తెలీదని చెప్పింది మధు.

మొత్తానికి అర్ధరాత్రి దాటుతుండగా వరంగల్ చేరుకున్నారు ఇద్దరు. ఊర్లోకి రాగానే చూస్తే అక్కడ రోడ్ల పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. చెట్లు పడిపోయి దార్లు చాలా మటుకు మూసుకు పోయాయి. మధు వాళ్ళ ఇంటికి దారి అసలే లేకుండా పోయింది. ఇక చేసేదేమీ లేక విజయ్ తనతో తన ఇంటికి రమ్మని, తెల్లవారాక వెళ్ళొచ్చునని అన్నాడు. ఇద్దరూ విజయ్ ఇంటికి చేరేసరికే రాత్రి రెండు దాటింది.

●●●

పూర్తిగా తెల్లవారాక విజయ్ మధుని వాళ్ళ అక్క ఇంట్లో దించాడు.

●●●

ఆ తర్వాత ఎన్నో సంఘటనలు వరసగా జరిగాయి. హైదరాబాదులో కీర్తి తండ్రికి హఠాత్తుగా సుస్తీచేసి హాస్పటల్‌లో చేర్పించారు. ఆయన కాస్త కోలుకోగానే బాగా బెంగ పడి వెంటనే కీర్తికి పెళ్ళి చేయాలని నిర్ణయించారు. కీర్తికి ఈ పెళ్ళి విషయం కాస్త కలవర పెట్టసాగింది. ఈ వార్త ఎందుకో వంశీతో చెప్పాలని అనిపించింది. ఎప్పుడూ నెమ్మదిగా, మొహమాటంగా, నోరే విప్పని కీర్తి తనకు పెళ్ళి చేయాలనుకుంటున్నారని, మీతో చెప్పాలనిపించిందని అనడమే తనని ఇష్టపడినట్టు చెప్పడంతో సమానంగా భావించిన వంశీ, ఉద్యోగం వచ్చాక తనే ఈ విషయమై కీర్తితో ఎలాగూ మాట్లాడవలసి ఉంది కాబట్టి వెంటనే కీర్తి వాళ్ళ ఇంటికి వెళ్ళి అమె తల్లితండ్రులతో కీర్తిని ఇష్టపడుతున్నట్లు చెప్పాడు. వాళ్ళు కూడా సంతోషంగా ఒప్పుకుని, ముందు ఓ మంచి రోజు నాడు నిశ్చితార్ధం జరుపుకుని, వంశీకి ఉద్యోగం వచ్చాక పెళ్ళి చేద్దాం అని నిర్ణయించారు. ఈ శుభవార్త విని మధు, విజయ్ కూడా యెంతో సంతోషించారు. పెళ్ళి అయ్యాక కూడా కీర్తి యధాప్రకారం కాలేజీలో చదువుకునేట్టు కూడా తీర్మానం అయింది.

మరో నెలలోపే వంశీ, కీర్తిలకి నిశ్చితార్ధం జరిగిపోయింది. అది జరిగిన వారానికే విజయ్ విదేశాలకు చదువు నిమిత్తం వెళ్ళిపోయాడు. మళ్ళీ రెండు సంవత్సరాలు పట్టచ్చు తిరిగి రావడానికి అని వెళ్ళే ముందు స్నేహితులందరితో బాగా గడిపి వెళ్ళాడు. మధుతో యెన్నో మాట్లాడాలని అనుకుంటూనే, అవకాశం రాక, అవసరం లేదేమో అని ఊరుకున్నాడు. మధు కూడా విజయ్ అందర్నీ వదిలి అంత దూరం వెళ్ళిపోతుంటే ఓ తెలీని బాధకు లోనయింది. భావోద్వేగాల నడుమ విజయ్ ప్రయాణం సాగిపోయింది.

కీర్తి, మధు యధాప్రకారం కాలేజీకి వెళుతున్నారు. వంశీకి క్యాంపస్ ఇంటర్వ్యూలో సెలక్షన్ వచ్చి చెన్నయ్‌లో మంచి ఉద్యోగం వచ్చింది. వెంటనే వెళ్ళి చేరిపోయాడు కూడా. ఈ నెల దాటితే మరి పెళ్ళి ముహూర్తాలు లేవని వెంటనే కీర్తి, వంశీల పెళ్ళికి అదే నెలలో ముహూర్తం పెట్టేసారు. పెళ్ళికి పదిరోజుల ముందే కీర్తి మధుని కూడా వెంట పెట్టుకుని సెలవు పెట్టేసి హైదరాబాదు వెళ్ళిపోయింది. పెళ్ళి పనులు జోరుగా సాగుతున్నాయి. వంశీ కూడా పెళ్ళికి వారం ముందే హైదరాబాదు వచ్చేసాడు. కొంతమంది స్నేహితులకు పెళ్ళి కార్డులు ఇవ్వడానికి మధుని కూడా తోడు తీసుకెళదామని మధు ఇంటికి వచ్చింది కీర్తి.

ఆ సమయంలో మధు ఇంట్లో ఒకతే ఉన్నది. పట్టపగలు పడుకుని ఉండటమే కాకుండా కన్ను, ముక్కు ఏకమైనట్టున్న స్నేహితురాల్ని చూసిన కీర్తికి గాభరా వేసింది. ఆదుర్దాగా వచ్చి, "ఒంట్లో బాగాలేదా మధు?", అని అడిగింది. ఆ మాటకే పట్టలేనంత దుఃఖం వచ్చేసింది మధుకి. హడలిపోయిన కీర్తి, కాసేపు సముదాయించగా కాస్త తేరుకున్న మధు అసలు విషయమేమిటో చెప్పడం మొదలు పెట్టింది. యెప్పుడూ హుషారుగా ఉండే మధు ఇలా బేలగా ఏడవటం అంటే యేదో పెద్ద విషయమే జరిగి ఉండాలి అని అనుకుంటున్న కీర్తి మధు చెపుతున్న విషయం వింటుంటే తన ఊహకే అందనంత విపరీతం జరిగిందని తెలిసి నిలువెల్లా ఒణికి పోయింది.

మధుమతి తల్లి కాబోతోంది. ఆ మాటే జీర్ణం కావట్లేదు అంటే దానికి కారణం విజయ్ అనే మాట అసలు అర్థం కావట్లేదు కీర్తికి. హైదరాబాదు నుంచీ వరంగల్‌కి విజయ్‌తో కలిసి వెళ్ళిన రోజు ఆ రాత్రి వాతావరణం బాలేక విజయ్ గదిలో ఉండిపోయానని, అతనితో యెంతో సన్నిహితంగా, ఇష్టంగా ఉండటంతో దగ్గరయి పోయానని చెప్పింది మధు. కానీ ఆ సంఘటన తర్వాత విజయ్ మళ్ళీ ఆ విషయం మాట్లాడలేదని, అతని వైపు నుంచీ ఎటువంటి మాట రాకపోయేసరికి, ఇది ఒకసారి చేసిన పొరపాటుగానే అతను భావిస్తున్నాడని అర్థం అవడంతో, అతని విదేశాల ప్రయత్నాలకి అడ్డం రాకుండా తను కూడా మాట్లాడలేదని, దాని పరిణామం ఇలా అవుతుందని ఊహించలేదని, యేమి చేయాలో తోచకుండా ఉందని మళ్ళీ యేడవ సాగింది మధు.

ఈ సమస్యకు ఎలా పరిష్కారం చేయాలో అర్థం కావట్లేదు కీర్తికి. మధుని సముదాయించి, వెంటనే వంశీకి ఫోను చేసి కలవమని చెప్పి, మధుతో కూడా వంశీ రమ్మనమని చెప్పిన స్థలానికి వెళ్ళింది. ముగ్గురూ ఈ సమస్యకు దారి వెతకసాగారు. ముందుగా జరిగిన విషయం మధు తల్లితండ్రులకు చెప్పడానికి నిశ్చయించుకున్నారు. విజయ్‌తో మాట్లాడినా ప్రయోజనం లేదని, అతను ఇప్పట్లో రాలేడని, అసలు తన పైన అతని అభిప్రాయం తెలియకుండా తొందర పడటం తన తప్పని, అందుకు ఇప్పుడు అతన్ని ఇబ్బంది పెట్టి, అతని చదువు పాడుచేయడం తన అభిమతం కాదని కచ్చితంగా చెప్పేసింది మధు. ఏదేమైనా తను ఒక్కతే డీల్ చేయదల్చుకున్నానని కూడా అంది. సమాజంలో పెళ్ళి కాకుండా తల్లి కావడం మామూలు విషయం కాదని, పెళ్ళి చేసుకోవడం మాత్రమే పరిష్కారం అని వంశీ, కీర్తి ఆమెకు నచ్చచెప్పారు.

దాదాపు రెండు రోజుల పాటు వాద ప్రతివాదాలు జరిగాయి. తర్జనబర్జనల తరువాత కీర్తి ఓ పరిష్కారం మార్గం చెప్పింది. ఆమె మాట విన్న అందరూ, ముఖ్యంగా మధు మీద కీర్తి కన్నా కుడా ఎక్కువ అభిమానం ఉన్న వంశీ, చాలా ఆశ్చర్య పోయారు. ఆమె చేయాలనుకున్న త్యాగానికి వంశీ ఒప్పుకున్నా మధు ఒప్పుకునే పరిస్థితి లేదు. ఇంతకీ తను తప్పుకుని అనుకున్న ముహూర్తానికి వంశీని మధుని వివాహం చేసుకోమని చెప్పింది. ఆ మాటకి ససేమిరా అంది మధు. మళ్ళీ ఘోర వాదనలు జరిగిన పిమ్మట చివరికి అందరూ కలిసి ఓ నిర్ణయానికి వచ్చారు.

●●●

ఆరు నెలల కాలం ఇట్టే గడచిపోయింది. వరంగల్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో బి.టెక్. రెండో సంవత్సరం పరీక్షలు జరుగుతున్నాయి. ఆ రోజే ఆఖరి రోజు. కీర్తి అప్పుడే రాయడం ముగించి పరీక్ష హాలు నుంచీ బయటకి వచ్చింది. ఇంతలో ఆమె ఫోను రింగు అవసాగింది. ఫోను మాట్లాడిన వెంటనే అప్పటికప్పుడు హాస్టల్‌కి వెళ్ళి బట్టలు సర్దుకుని బస్టాండుకి బయలుదేరింది. చెన్నయ్ బస్‌కి టికెట్టు కొనుక్కుని ఎక్కి కూర్చుంది.

చెన్నయ్‌లో దిగగానే ఆటో మాట్లాడి ఓ హాస్పటల్ పేరు చెప్పి తిన్నగా అక్కడికి పొమ్మంది. రిసెప్షన్ దగ్గరే వంశీ ఎదురు పడ్డాడు. ఇద్దరూ 'మెటర్నటీ ' వార్డు వైపు దారి తీసారు. కాసేపటికి సిజేరియన్ ఆపరేషన్ అయి ఆడపిల్ల పుట్టింది మధుమతికి అనే

శుభవార్త విన్నారు అంతా. ఆపరేషన్ అయిన కాసేపటికి వంశీ, కీర్తి లోపలకి వెళ్ళి మధుని, పుట్టిన పాపను చూసారు. పుట్టిన పిల్లల్లో తల్లితండ్రుల పోలికలు అంత ఎక్కువగా కనపడటం ఎప్పుడూ చూడలేదు వీళ్ళు. కొట్టొచ్చినట్టు కనపడుతున్న విజయ్ ముఖకవళికలు చూసి కళ్ళల్లో నీళ్ళు పెట్టు కుంది మధు.

ఆ నిమిషంలో కొన్ని నెలల క్రితం తనని వంశీని పెళ్ళి చేసుకోమని కీర్తి చెప్పడం, దానికి తను ఒప్పుకోకుండా మరో మార్గం చెప్పి వంశీ, కీర్తిల సహాయం అడగటం గుర్తు వచ్చింది. తన తల్లితండ్రులకు తప్ప మరో మనిషికి తెలియకుండా కీర్తి తన భర్త వంశీ సహాయంతో ఇన్నాళ్ళు చెన్నయ్‌లో తనకు ఆశ్రయం ఇవ్వడం, తనకు బిడ్డ పుట్టాక కొత్తగా పెళ్ళయి సంవత్సరం అయినా కాకుండానే ఆ బిడ్డను వాళ్ళు దత్తతు చేసుకుంటామని వాగ్దానం చేయడం..ఇవన్నీ సినిమా రీళ్ళలాగా కళ్ళ ముందు పరిగెట్ట సాగాయి. స్నేహితురాలికోసం తన జీవితాన్నే త్యాగం చేయబోయిన కీర్తికి, ప్రేమించిన అమ్మాయిని సహితం వదలి, మరెవరిదో అయిన సంతానానికి తను ఆసరా కల్పించడానికి సిద్ధం అయిన వంశీకి నవమాసాలు మోసి కన్నబిడ్డను దత్తతు ఇవ్వడానికి సంకోచించలేదు మధు.

ఆ క్షణం నుంచీ ఆ బిడ్డ కీర్తి, వంశీల సంతానమయ్యింది. ఇరుపక్షాల తల్లితండ్రులకి సహితం ఈ బిడ్డను ఆదర్శం కోసం పెంచుకుంటున్నామని నమ్మించారు తప్ప మధు విషయం బయటకి రానీలేదు కీర్తి, వంశీలు.

●●●

మరో రెండేళ్ళ కాలం తిరిగిపోయింది. కీర్తి, మధు కూడా చదువు పూర్తి చేసారు. ఇద్దరికీ చెన్నయ్‌లోనే మంచి ఉద్యోగాలు వచ్చేసాయి. ఈ రెండేళ్ళలో వంశీ అతని తల్లి సహాయంతో పాపను పెంచాడు. మధు తన బిడ్డను రోజూ చూసుకుంటోంది...కానీ పాపకు తాను కన్న తల్లిగా ఎప్పుడూ ప్రవర్తించలేదు. కీర్తి మాత్రమే పాపకు తల్లి అన్నట్టు ఉండేది.

ఉన్నట్టుంది అందరి జీవితాల్లోకి విజయ్ మరో సారి వచ్చాడు. చదువు పూర్తయి, ఉద్యోగం చేస్తూ, పెళ్ళి కూడా కుదిరి ఇండియాకు వచ్చిన విజయ్ తన పాత స్నేహితులని కలుకోవడానికి, పెళ్ళికి పిలవాలని చెన్నయ్ వచ్చాడు. వంశీ, కీర్తిల సంసారం చూసి ఎంతో ముచ్చట పడ్డాడు. ఆదర్శంగా అనాధగ ఉన్న ఓ పాపను పెంచుకుంటున్నారని తెలిసి అబ్బుర పడ్డాడు. పాపను చూసిన విజయ్ ఓ విధమయిన భావోద్వేగానికి లోనవ్వడం వంశీ, కీర్తి గమనించక పోలేదు. తన పోలికలు ఎంతో కొట్టొచ్చినట్లు కనపడుతున్న ఆ పాపను వదలలేక పోతున్నాడు విజయ్.

ఉన్న వారం రోజులలోనే మధు కూడా అదే ఊర్లో ఉందని తెలుసుకున్నాడు. జరిగిన గతం ఒక్కసారిగా గుర్తు వచ్చింది విజయ్‌కి. మధుని కలవాలని అనుకుంటున్నానని అన్నాడు వంశీతో. ప్రశాంతంగా గడుపుతున్న మధు జీవితంలోకి మళ్ళీ విజయ్ రావడం సుతారం ఇష్టం లేదు వంశీకి. తనని కూడా పెళ్ళికి పిలవాలని విజయ్ అనడటంతో మరో మాట మాట్లాడలేక వంశీ ఆ మర్నాడే విజయ్‌ను మధు దగ్గరికి తీసుకెళ్ళాడు. వాళ్ళతో పాటు కీర్తి, పాప కూడా వచ్చారు. విజయ్ వచ్చాడు అని అసలు తెలియని మధు ఒక్కసారిగా షాక్ అయ్యింది. అందర్నీ కలిసి చూడటంతో విషయం మొత్తం వంశీ ద్వారా తెలిసి ఉంటుంది విజయ్‌కు అనుకుంది మధు. అందరూ లోపలకి వస్తూంటేనే వంశీకి ఆఫీసు ఫోను రావడంతో వెంటనే బయటికి వెళ్ళి పోయాడు. పాపతో పాటు కీర్తి, విజయ్ లోపలికి వచ్చి కూర్చున్నారు. చాలా మామూలుగా మధుని పలకరించాడు విజయ్. కాఫీ కలుపుకుని వస్తానని లోపలికి వెళ్ళింది కీర్తి. హాలులో మధు, విజయ్...వాళ్ళకు పుట్టిన పాప విజయ్ ఒళ్ళో. ఆ క్షణం ఆమె మనసులో రేగిన భావం, ఆవేశం మాటలకి అందనిది. విజయ్‌కి కూడా మధుతో ఏమని మాట్లాడాలో తెలియలేక పాపను ఆడిస్తూ కూర్చున్నాడు. తను కూడా వంట ఇంటిలోకి వెళదామని లేచిన మధు తిరిగి వచ్చి అతని దగ్గరికి వెళ్ళింది. మధుని చూసి లేచి నిలుచున్నాడు విజయ్. ఇంతలో పాప కీర్తి దగ్గరికి 'అమ్మా' అంటూ పరిగెట్టింది. మరుక్షణం ఉధ్రుతంగా, ఉప్పెన లాగా ఏడుపు కట్టలు తెంచుకుంది మధుకి. అర్థం కాని విజయ్ యేమయిందని మధును దగ్గరికి

తీసుకోబోయాడు. వెంటనే విజయ్‌ని గట్టిగా హత్తుకుపోయి ఏడవ సాగింది మధు. ఇంతలో అతని చేతిలో ఉన్న పెళ్ళి కార్డు మీద ఆమె దృష్టి పడింది. వెంటనే జరిగి సరిగ్గా నిలుచుని ఆ కార్డు చూసిన మధు చేతులు వెంటనే వణక సాగాయి.

విజయ్ అయితే పెళ్ళికి పిలవడానికి వచ్చాడు కానీ తన కోసం, విషయం తెలిసి కాదని అర్థం అయింది. కోపం కట్టలు తెంచుకుంది. ఏడుస్తూ అతన్ని హత్తుకున్న చేతులు విసురుకా అతని రెండు చెంపలని తాకాయి. ఎడా పెడా వళ్ళు తెలీకుండా కొట్టేస్తోంది. ఫోను ముగించి లోపలకి వచ్చిన వంశీ, కాఫీ కప్పులతో హాలులోకి వచ్చిన కీర్తి గబగబా వచ్చి మధుని ఆపారు. వెంటనే మధుని లోపలకి తీసుకెళ్ళింది కీర్తి. విజయ్, వంశీ బయటకి వెళ్ళిపోయారు, పాపని కూడా తీసుకుని. ఒక కాఫీ షాపులో కూర్చున్నాక ప్రశ్నార్థకంగా చూస్తున్న విజయ్‌ను ఉద్దేశించి జరిగిన విషయం చెప్పసాగాడు. వింటున్న విజయ్ కాళ్ళకింద భూమి తలకిందలయిపోసాగింది. "పాపను సరిగ్గా చూడు విజయ్....నీ పోలికలు ఎన్ని కనబడుతున్నాయో...అలాగే మధు ముఖకవళికలు కూడా ఎన్ని ఉన్నాయో చూసావా....మీ ఇద్దరి ఆనాటి పొరపాటుకు సాక్ష్యం ఈ పాప"....వంశీ అన్న ఈ మాటలు తప్ప మరేదీ వినపడటం లేదు విజయ్‌కి. ఓ గంట అయ్యాక తేరుకున్న విజయ్ అన్నిటికన్నా ముందు తను చేసుకోబోతున్న పెళ్ళికూతురికి ఫోను చేసాడు.

●●●

పెళ్ళి క్యాన్సిల్ చేసుకుని, సెలవు పొడిగించుకుని మధు ఆమోదం కోసం ఎదురు చూస్తున్నాడు విజయ్. క్షణికంగా చేసిన తప్పుగా అతను అనుకున్నాడు...ఆమె చాలా ఫాస్ట్ అని...అందుకని తనతో తొందర పడింది అనే ఉద్దేశం అతనిది. మనసుకు సన్నిహితుడుగా, మంచివాడుగా భావించి, ఈ విధంగా దగ్గరయినా మళ్ళీ దూరం అవమనే ఆలోచనలతో అతనికి దగ్గరయింది ఆ అమ్మాయి. మరో మాట లేకుండా అతను వెళ్ళిపోయాడు. తన జీవితంలో వేరే వ్యక్తికి చోటివ్వగలనా అనుకుంది ఆ క్షణం. తను గర్భవతినని తెలిసాక మరో వ్యక్తి ప్రసక్తే లేదిక అని నిర్ణయించుకుంది. అతను అతి సాధారణంగా తన పెళ్ళికి పిలవడానికి వచ్చాడు. జరిగినది విని పెళ్ళిమానుకుని ఆమె కోసం ఎదురు చూస్తున్నాడు. కానీ ఆమెకు ఈ రోజు అపూర్వమైన స్నేహితుల అండ ఉంది. తన కాళ్ళ మీద నిలబడే ధైర్యం, ఆసరా ఉన్నాయి. ఆమెకు ఈ క్షణం కావాల్సినది జాలి కాదు..పశ్చాత్తాపం అసలే కాదు. కావాల్సింది ఒక్కటే...ప్రేమ. మరి ఆ ప్రేమ విజయ్ ఇవ్వగలిగిన నాడు అతన్ని స్వీకరిస్తుంది మధుమతి. అతని సెలవు ముగిసే లోపు ఇది జరగాలని ఆశిద్దాం.

●●●

**Click here to share your comments on this story**